స్కెచ్

# జీవనరాగం

"రత్నం"

గుడ్డి వెన్నెల. చెట్టుమీది పిట్టొకటి మెల్లగా గునిసింది. ఆషాఢ మేఘ శకలాలు నీలాకాశంలో కుప్పలుదేలి ఉన్నయ్. పిల్లగాలితో సన్నజాజిపందిరి గుబాళించింది.

తోటకూర కాడలా మంచానికంటుకొని నిద్రపోతున్న ప్రియురాలివైపు తదేక దీక్షగా చూస్తున్నాడు రావు. ఏవేవో అస్పష్ట భావాలు మస్తిష్కంలో మసిలిపోతున్నయ్.... ఆ వేగంతో... ఉక్రోషంతో మెదడంతా వేడెక్కిపోతున్నది. ఒక్క నిట్టూర్పు విడిచాడు ఏదో స్ఫురణకు వచ్చి. ఎంత కలతజెందాడో, కల్లోలంలో మునిగాడో... అంత ఊరట దొరుకుతోంది అర్థాంగివైపు చూస్తూంటే. ఆ సాయంత్రం జరిగిన సంఘటన తన బలహీనతకు నిదర్శనం. ఆ భావం తీపి కలల్ని... మధురానుభూతుల్ని వెనక్కినెట్టి పురుగు తొలిచినట్టు తొలుస్తున్నది. అందుకనే ప్రియురాలివైపు ఊరికే చూస్తూ... ఉపశాంతిపొందుతూ.... జరిగిన దాన్ని తిరగేసుకుంటున్నాడు.

* * *

"కనకం, కనకం!" పిలుస్తున్న రావు కంఠంలోని వికృతధ్వని... పరిహాసం... గిలిగింతపెట్టినా, మూతిముడుచుకొని పులుకుపులుకుగా చూసింది భర్త కళ్ళల్లోకి దుర్గ.

"కనకం కనకమంటూ శునకాన్ని చేస్తున్నారే మొత్తానికి! ఇక ఎప్పుడూ అలా అనకండి." ఓరగా చూస్తూ హెచ్చరించినట్టున్న ప్రియురాలి ముఖవైఖరి రావుని మరింత రెచ్చగొట్టింది.

"కనక దుర్గాబాయీ!" చిలిపిగా నవ్వుతూ దీర్ఘంతీశాడు రావు. ఈసారి నవ్వాపుకోలేకపోయింది దుర్గ. ఇద్దరూ ఒక్కసారి కడుపుబ్బ పకపకా నవ్వేశారు విచ్చుకొన్న మొగ్గల్లా.

తన నామధేయం "నారాయణరావు"ను కాస్తా "నా..."అనీ "రావూ...?"అనీ, "నా... రావూ...!"అనీ రకరకాల పరిభాషల్లో కుదిస్తున్న పెళ్ళాంపేరు అదో అలుసైపోయింది రావుకి.

కట్నంలేకుండా ఆదర్శ వివాహంచేసుకున్నాడు రావు. దుర్గ అతనితో పాటు పంతులుగిరీలోదే గనుక ఆర్థిక సమస్య కూడా దానంతటికదే పరిష్కారమైపోయింది. పెళ్ళయిన మర్నాడే ఆచారాలనీ—అలవాట్లనీ ప్రక్కకునెట్టి, చిలకా, గోర్వంకల్లా పలకరించుకొంటూ... పరుగులు తీస్తూ... అయస్కాంతాల్లా ఆకర్షించుకొంటున్న ఆ యువ దంపతులకు ఏకాంత సమయాల్ని కల్పించి విడిచిపెట్టి ఊరుకొన్నారు దుర్గ తలిదండ్రులు. ఇక దానితో లేచింది దుమారం. ఏదో అఘాయిత్యం ఆ మొగుడూ పెళ్ళాల మధ్య జరిగిపోతున్నట్టు, కొంపలు కాలిపోతున్నట్టు ... బుగ్గలు నొక్కుకున్నారు అమ్మలక్కలు.

"ఓ బంతీలేదు. పేరంటమూ లేదు!"—పెదవి విరిచింది పిల్లల పెళ్ళిళ్ళకయిన అప్పుల భారంలో తలదాకా మునిగిన ఓ గుమాస్తా భార్య.

"చూడండే ... ఎట్లా పులుంకొని తిరుగుతున్నారో! అంతా కలికాలం!" ఎదురుగానే వ్యాఖ్యానించింది ఓ సత్తెకాలపు యిల్లాలు.

"కార్యం చేయకుండానే కాపురం చేస్తున్నారట" అందరి యిళ్ళకు వెళ్ళి చెవులు కొరికివచ్చింది ఓ తలచెడిన ప్రౌఢ.

పెండ్లయి వారమే అయినా మనసిచ్చి వ్యక్తిత్వం చూపుతున్న సహచరి కళ్ళల్లోని మెరుపుల్ని చూసి, ఆ విమర్శలన్నిటినీ కాకిగూత లన్నిటినీ పాచిని దూరంగా త్రోసేసినట్లు లెక్కచేయలేదు రావు.

* * *

"రేపటినుంచేగా ఆషాఢమాసం. అల్లుళ్ళందరూ వెళ్ళిపోయారు!" అర్ధోక్తిలో ముగించింది అప్పుడే యింట్లోకి వచ్చిన ఓ వయస్సు మళ్ళిన యిల్లాలు. అత్తగారితో. గదివైపు చూసింది. ఏదో గొణిగారు అత్తావాళ్ళూ. అది తనను గురించిన వ్యాఖ్యానమేనని మనసు చివుక్కుమన్నది రావుకు, ఇక అక్కడ క్షణం నిలవ బుద్ధికాలేదు. అభిమానం దెబ్బతిన్నట్టు

మనసంతా క్షణంలో వికలవికలమైపోయింది. ఏదో అసహనం హృదయాన్ని కవ్వంలా కలచి వేసింది.

ప్రయాణ సన్నద్ధమవుతున్న రావుని చూసి కాఫీ పట్టుకొచ్చిన దుర్గ నిర్విణ్ణి అయింది.

"గుడ్డలన్నీ సర్దు యింటికెళ్ళాలి!" పెట్టెమూత విసురుగావేసి ఏదో సర్దుతున్నాడు రావు.

"ఏమిటండీ యిదంతా?" ప్రశ్నార్థకంగా వెలవెలబోతూ చూసింది భర్తవైపు దుర్గ. మఱునాటి ఉదయానే ఇటునుంచి యిటే స్కూలుకు వెళ్తానన్న రావు, ఇప్పుడే ఎందుకు వెళ్ళజూస్తున్నాడో దుర్గకు అర్థంకాలేదు. క్షణం క్రితం కలకలమంటూన్న ఆ వాతావరణంలో ఓ దారుణ నిశ్శబ్దం అలుంకొన్నది. తీపికలల్లో కాలక్షేపం చేస్తున్న ఆ కొత్త సంసారులమధ్య ఓ కఠిన పరీక్ష పరిష్కారానికి నిలిచింది.

"ఇంటికెళ్ళాలి పనుంది" బడబడ మాట్లాడే రావు కంఠం మూగవోయినట్టు ముక్తసరిగా ఎందుకు కుంచించుకు పోయిందో తెలీక సతమత మవుతున్నది దుర్గ.

"రేపుదయానే వెళ్తానంటిరిగా!" దుర్గ గొంతుకలో పొంగుతున్న గాద్గద్యం రావు నదోలా మార్చింది.

"ఇక్కడే కూచోమంటావేమిటి? ఇదే పనిగాదుగా నాకు! ఇంటిదగ్గర పనుందంటే వినిపించలా?" రావు మాట్లాడేతీరులో యేమూలా మార్దవం కనిపించలేదు దుర్గకు.

"ఏమండీ ఉండరూ! ఇప్పుడేవెళ్తే అమ్మావాళ్ళు యేమనుకుంటారో తెలుసా?" కళ్ళనీళ్ళు నింపుకొని బ్రతిమాలుతున్న ప్రియురాల్ని చూసి వేదాంతిలా నవ్వేశాడు రావు. అసహనం రోషం హృదయంలో ఓ ప్రక్కకు తప్పుకున్నయ్.

"ఎందుకండీ నన్నిట్లా యేడిపిస్తారు. ఏం తప్పు చేశానని!" జలజలా కన్నీరు రాలుస్తున్న దుర్గ కాతరకంఠం రావునిట్టే కరిగించివేసింది.

"మరి రేపేగా ఆషాఢం! నేనెందుకిక్కడ?" కారణాన్ని చల్లగా బయటపెట్టాడు రావు. అప్పుడర్థమయింది దుర్గకు భర్త యెందుకు ప్రయాణమయ్యాడో. "ఆషాఢం అనుకుంటారేమో మనకేం అపట్టింపుల్లేవు వచ్చే శని ఆదివారాల్లో యిక్కడికే రమ్మను" అల్లుడితో చెప్పమన్న తల్లిగారి మాటకూడా గుర్తుకువచ్చింది దుర్గకు.

"భలే పట్టింపులండీ మీవి! ఆషాఢమూ లేదు. అమావాశ్యాలేదు... ఇంతకీ ఉంటారా...!" నిలదొక్కుకొని వచ్చి వెలక్కాయ ప్రశ్న వేసింది రావును. లోలోపల ఉండ బుద్ధయినా బెట్టుసరిగా "ఇంటిదగ్గర పనుందే... ఎట్లాగబ్బా!" ఆలోచిస్తున్నట్టు పోజుపెట్టిన భర్త నాటకానికి లోలోపల నవ్వు పొంగినా "ఏమండీ... అట్లయితే చొక్కా యిచ్చేదేమిటి?..." అని వంకెకు తగిలించిన చొక్కా తీస్తూ యికఆగలేక పకాపకా నవ్వేసింది దుర్గ.

తగిందే దొరికిందని తృప్తిపడుతూ... ఆ గాజుల చేత్తో యిచ్చిన తిక్తకషాయాన్ని చవిచూస్తూ... లక్ష్యంలేదన్నట్టు, మర్చిపోయినట్టు అభినయించాడు ఆ కోడెగాడు.

* * *

చిన్న సమస్య అంతర్ఘాతంగా పరిణమించి నాటకంలో లా మారినా ఆ సంఘటనా... హావభావాలూ—అన్నీ ఒకటొకటే గుర్తుకు వస్తున్నయ్ రావుకు, కాని మరోవైపు ఏదో అస్పష్టమైన బాధ మనసును కుదుటపడనీయడం లేదు. బాధలకు గురిచేసి... ఎంత చూడ్డానికి తయారయ్యే సంకుచిత తత్వాలంటే మంట మండి పోతున్నది రావు హృదయంలో. కాని దుర్గ ఎదురుగావుంటే... ఆ చిరునవ్వుల మధ్యనైనా ఎదుర్కొనే గుండె దిటవు కన్పిస్తూవుంటే... అన్ని సమస్యల్నీ తోసేస్తున్నాడు రావు. అందుకే ప్రియురాల్ని ఊరికే చూస్తూ ఆలోచిస్తున్నాడు.

"ఏవండీ... యింకా నిద్రరాలా... ఓహో అదా ఆషాఢం మళ్ళాయేవస్తా...! రేపు వెళ్ళచ్చుగాని నిద్రపోరూ?"— పసివాణ్ణి బుజ్జగిస్తున్నట్టు మరిపెం చూపిస్తూ చిలిపిగా నవ్వుతున్న ప్రియురాల్ని బాహుబంధాల్లో యిరికించాడు రావు.

కొప్పులో మల్లెలు కిలకిలమన్నయ్. మేఘశకలం చంద్రుణ్ణి కప్పేసింది. ఏదో ప్రేమరాగాలు ప్రకృతి సంగీతంలో కలిసిపోయినయ్. సమస్యలూ, ఆలోచనలు, అశాంతీ... అన్నీ ఆ వాహినిలో కొట్టుకుపోయినయ్. ★